క్లుప్తంగా

రూ.7 లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని ఒడ్డుకింద తండాలో ఆర్డీటీ ఆధ్వర్యంలో గురువారం వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ ప్రమీల కుమారి మాట్లాడారు. హాజరయ్యారు. గ్రామ స్వరాజ్య నిధి ద్వారా రూ.7 లక్షలతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ సంజీవరెడ్డి, సర్పంచ్ నందిని, వైఎస్సార్‌సీపీ నాయకులు మునిస్వామి నాయక్, మహేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

పుట్టపర్తి అర్బన్: ఈనెల 23వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకూ మండలంలోని 8 సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు నోడలాఫీసర్ శివారెడ్డి, ఎంపీడీఓ అశోక్ కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆధార్ కార్డులు తీస్తారన్నారు. 23న నిడిమామిడి, 24న రాచువారిపల్లి, 26న పెడపల్లి, 27న దిగువచెర్లోపల్లి, 28న జగరాజుపల్లి, 30న వెంగళమ్మ చెరువు, జూలై 3న చెర్లోపల్లి, 4న అమగొండపాళ్యం సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 0–5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులందరికీ ఆధార్ తీయించాలన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలని ధర్నా



నారాయణ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కదిరి అర్బన్: ఈఎంఐ, ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతిలో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న నారాయణ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నారాయణ పాఠశాల వద్ద వారు ధర్నా చేపట్టారు. నారాయణ, జైన్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ పాఠశాలల్లో ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పుస్తకాలు, యూనిఫాం, షూ, బెల్ట్ పేరిట ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు రాజేంద్ర, మహేంద్ర, సాయి, కిషోర్, సంతోష్ పాల్గొన్నారు.

బస్సు పాసుల ధరలు తగ్గించాలని వినతి



డీఎం మైనుద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: విద్యార్థుల బస్సు పాసుల ధరలు తగ్గించాలని కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మైనుద్దీన్‌కు ఏఐఎస్‌ఎఫ్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో బస్సు పాసుల ధరలు తక్కువగా ఉండేవన్నారు. ఈ ఏడాది బస్స పాసుల ధరలు పెంచారని తెలిపారు. కదిరి చుట్టుపక్కల మండలాల నుంచి పేద విద్యార్థులు కదిరికి వచ్చి చదువుకుంటున్నారని పేర్కొన్నారు. పేద విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని బస్సు పాసుల ధరలు తగ్గించాలని కోరారు. పాఠశాల సమయానికి బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపేంద్ర, టిప్పు, జనా, రాజు,రవి, శివ, గణేష్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారులు

తలుపుల: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం వైద్యాధికారులు మున్వర్ బాషా, సల్మా తదితరులు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకూ ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. వ్యాధి లక్షణాలు, చికిత్స విధానంపై అవగాహన కల్పించాలన్నారు.

కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ విద్య



ధర్మవరం: విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



నల్లమాడ: పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



కనగానపల్లి: విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

- విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పురస్కారాల ప్రదానం

ధర్మవరం: కేజీ నుంచి పీజీ వరకూ కార్పొరేటుకు దీటుగా పేద విద్యార్థులకు జగనన్న ప్రభుత్వం ఉచిత విద్యను అందిస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారని కొనియాడారు. గురువారం స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ వ్యాప్తంగా టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థుల తల్లిదండ్రులను కార్పొరేట్ విద్యా సంస్థల మాఫియా జలగల్లా పీడిస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ మాఫియా ఆగడాలు పెచ్చుమీరడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ మాఫియా ఆగడాలను అరికట్టి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం జరిగిందన్నారు. అమ్మ ఒడి, నాడు–నేడు, జగనన్న విద్యా, వసతి దీవెన పథకాల ద్వారా చేయూత అందిస్తున్నట్లు వెల్లడించారు. ధర్మవరం నియోజకవర్గంలోనే నాడు–నేడు పథకం ద్వారా రూ.74 కోట్లు నిధులను ఖర్చు చేసి పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అలాగే అమ్మ ఒడి పథకం ద్వారా ఇప్పటి దాకా నియోజకవర్గంలో పిల్లల్ని బడులకు పంపే తల్లుల ఖాతాల్లో రూ.162 కోట్ల నిధులను జమ చేయడం జరిగిందన్నారు. పిల్లలకు రోజూ పౌష్టికాహారం అందించేందుకు జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ చర్యల కారణంగా ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు.

జగనన్న ఆణిముత్యాలు వీరే..

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పట్టణానికి చెందిన జింకా ఆదిశంకర్ (586/600 (ఏపీ మోడల్ స్కూల్), బాలం సాయి ప్రసాద్ (586/600), మాదన మురళి (586/600), ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి విభాగంలో రూ.15 వేలు ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. అలానే రెండో బహుమతి కింద ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని కడపల కృష్ణ తులసి రూ.10 వేల బహుమతి అందుకుంది. మూడో బహుమతి విభాగంలో తాడిపత్రి ముబాశిర 584 మార్కులు సాధించడంతో రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. అలాగే ఇంటర్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు నీరుగంటి లతా ఎంపీసీలో 971 మార్కులు, సాకే ఓంశేఖర్ హెచ్‌ఈసీలో 698, సీఈసీలో గుజ్జల మౌనిక 902, బీపీసీలో పందెం హర్షిక 972 మార్కులు సాధించారు. వీరందరికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను, కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఎంలను ఎమ్మెల్యే కేతిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ తిప్పేనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, తహసీల్దార్ యుగేశ్వరి, వైస్ చైర్మెన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, ఎంఈఓ సుధాకర్ నాయక్, కౌన్సిలర్లు షంషాద్ బేగం, వేముల జయరామిరెడ్డి, చందమూరి నారాయణరెడ్డి, కడప రంగస్వామి, వార్డు ఇన్‌చార్జ్‌లు ఉడుముల రామచంద్ర, చాంద్‌బాషా, ఎస్వీ రమణారెడ్డి, తోపుదుర్తి వెంకటరాముడు, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే 'జగనన్న ఆణిముత్యాలు'

నల్లమాడ: చదువులో విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ప్రవేశపెట్టిందని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం నిర్వహించారు. గత విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన సాయిచరణ్ (524 మార్కులు), ఎస్.చాందినీ (508 మార్కులు), డీ.స్పందన (498 మార్కులు)ను సన్మానించారు. అలాగే మెడల్స్, షీల్డ్‌తో పాటు రూ.3,000, రూ.2,000, రూ.1,000 చొప్పున నగదు బహుమతులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లక్ష్మీప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కనుముక్కల లక్ష్మన్న, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, అయూబ్‌బాషా, సోమశేఖర్, బాబూనాయక్, యాసీన్, ఫైరోజ్ బాషా, చంద్రశేఖర్ నాయక్, ప్రతాప్, సుధాకర్, పోతులయ్య, గీతా, మారుతీ, రవీంద్రనాయక్, శివలక్ష్మీదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం

కనగానపల్లి: ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆణిముత్యాలు కార్యక్రమం అమలు చేస్తోందని మామిళ్లపల్లి కేఆర్‌ఆర్ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం స్నేహలత అన్నారు. టెన్త్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు వంశీ, సాయి లక్ష్మి, శరత్‌కుమార్‌కు ఆణిముత్యాలు కింద గురువారం నగదు బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. సర్పంచ్ ఓబిరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శివయ్య, ఉపాధ్యాయులు నాగేంద్రరెడ్డి, రామచంద్ర, శివారెడ్డి, నాగరాజు, జయచంద్ర, పీఈటీ శివారెడ్డి పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

నల్లచెరువు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీలో భాగంగా సామాజిక తనిఖీ అధికారులు, ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ శకుంతల గురువారం సమావేశం నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 13 గ్రామాల్లో జరిగిన 318 ఉపాధిహామీ పనుల రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. సామాజిక తనిఖీ అధికారులకు ఉపాధి సిబ్బంది సహకరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనులకు సంబంధించిన ఫైళ్లు, కొలతలను చూపాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ కాంతయ్య, డీఆర్పీ క్రిష్టప్ప, ఏపీఓ మంజుల, ఈసీ బాలు నాయక్, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

అర్హులకు ధ్రువపత్రాలు అందించడమే లక్ష్యం



'జగనన్న సురక్ష'పై అవగాహన కల్పిస్తున్న పార్టీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి, గొడ్డువెలగల సచివాలయాల పరిధిలో గురువారం 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఓ బాబ్‌జాన్ మాట్లాడుతూ.. గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు తమకు కేటాయించిన గ్రామాల్లోని ఇంటింటికి తిరిగి సర్వే చేయాలన్నారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి రుసుము లేకుండా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, గ్రామ పంచాయితీ కార్యదర్శులు రఫీ, బాషా, ఆయా గ్రామాల వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నల్లచెరువు: ఓరువాయి, ఎం.అగ్రహారం, అల్లుగుండు గ్రామాల్లో జేసీఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్, ఎఫ్‌ఏఏ శివాజీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వలంటీర్లు తమ క్లస్టర్లలో సర్వే చేపట్టాన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, సానే హరినాథ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, వలంటీర్లు గృహసారథులు పాల్గొన్నారు.

నల్లబోయన పల్లిలో తాగునీటి ఎద్దడి

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సర్పంచ్ ప్రభాకరరెడ్డి



వృథాగా ఉన్న పంచాయతీ బోరు

బత్తలపల్లి: మండలంలోని నల్లబోయనపల్లిలో సర్పంచ్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తాగునీటి సమస్య తలెత్తిందని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ స్కీం బోరు రెండు నెలల క్రితం దెబ్బతింది. ఈ విషయాన్ని సర్పంచ్ ప్రభాకరరెడ్డి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లినా పట్టించుకోలేదు. పది రోజుల తరువాత నీటి సమస్య మరింత తీవ్రమైంది. దీంతో గ్రామస్తులు ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మోటారును బయటకు తీయించి.. పరిశీలించగా కాలిపోయింది. మోటారుకు మరమ్మతులు చేయించేందుకు మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లారు. పాత మోటారుకు మరమ్మతులు చేసి, మళ్లీ బిగించారు. మూడు రోజుల తరువాత మరోసారి మోటరు రిపేరుకు రావడంతో సర్పంచ్ మళ్లీ పట్టించుకోలేదు. గ్రామస్తులు మళ్లీ వైఎస్సార్‌సీపీ నాయకుడి దగ్గరకు వెళ్లి చెప్పారు. దీంతో ఆయన కొత్త మోటారు కొని బిగించారు. అయితే కొత్త మోటారు కొనుగోలు, పాత మోటారు మరమ్మతులకు చెల్లించిన నగదు కోసం సర్పంచును పంచాయతీ రెజుల్యూషన్ ఇవ్వాలని కోరారు. మీరు వేసింది కొత్త మోటారో కాదో నాకెలా తెలుస్తుంది అని సర్పంచ్ నిర్లక్ష్యంగా బదులు ఇస్తున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు మోటారును బయటకు తీయించడంతో మరోసారి నీటి సమస్య తలెత్తింది. ఇంటి ముందు ఉన్న బోరులో దించింది కొత్త మోటరు అవునా? కాదా? అనేది కూడా తెలియకుండా సర్పంచ్ మొండికేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సర్పంచ్ రెజుల్యూషన్ పాస్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సెల్‌ఫోన్ల చోరీ

కొత్తచెరువు: మండల కేంద్రంలో గురువారం నాలుగు సెల్‌ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కాయగూరల సంత కావడంతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు మార్కెట్‌కు వచ్చారు. ఈ క్రమంలోనే నలుగురికి చెందిన సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రాంతాల కతీతంగా, పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక 23వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. పలువురు వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సత్వరం పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను ఆదేశించారు. అనంతరం వార్డులో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు పరిశీలించారు. గర్ల్స్ జూనియర్ కాలేజీని సందర్శించారు. పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వంట శాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ నెరవేర్చారన్నారు. వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, నాడు–నేడు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, నేతన్న నేస్తం తదితర పథకాల ద్వారా జగనన్న పేద ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చారన్నారు. రాబోయే రోజుల్లో బూటకపు మాటలతో టీడీపీ నాయకులు మరోసారి మభ్యపెట్టేందుకు వస్తారన్నారు. ఆచరణకు సాధ్యం కాని హామీల చెప్పే వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వార్డు కౌన్సిలర్ షకీలా, వార్డు ఇన్‌చార్జ్ ఎస్పీ బాషా పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



వై.రామనాథరెడ్డి, ఓడీ చెరువు | శోభ సువర్ణమ్మ, తనకల్లు | ఎస్.కే.హమీద్‌బాషా, గాండ్లపెంట | నరేంద్రకుమార్, ఎన్పీకుంట | శ్రీధర్, తలుపుల | ఎన్.రవికుమార్, నల్లచెరువు

ఎన్పీకుంట: నూతన తహసీల్దార్‌గా బి.నరేంద్రకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వైఎస్సార్ కడప జిల్లా చక్రాయపేట మండల డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై తహసీల్దార్‌గా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులు నూతన తహసీల్దార్‌ను పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీటీ రవినాయక్, ఆర్‌ఐ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల తహసీల్దార్‌గా ఎస్.కే.హమీద్‌బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు జిల్లా ఐరాల మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ పదోన్నతిపై తహసీల్దార్‌గా వచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ రవి, రెవెన్యూ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, జేసీఎస్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్అలీ, సర్పంచ్‌లు నూతన తహసీల్దార్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

తలుపుల: నూతన తహసీల్దార్‌గా కే.శ్రీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఓడీసీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మునిస్వామి సీఎస్‌డీటీగా కొనసాగుతారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. అందరి సహకారంతో సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

తహసీల్దార్‌కు ఘన స్వాగతం

నల్లచెరువు: మండల నూతన తహసీల్దార్‌గా ఎన్.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పూలమాలలతో తహసీల్దార్‌కు స్వాగతం పలికారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అశోక చక్రవర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓడిచెరువు తహసీల్దార్‌గా రామనాథరెడ్డి

ఓడీ చెరువు: మండల తహసీల్దార్‌గా వై.రామనాథరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలులో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ శ్రీధర్ బదిలీపై తలుపులకు వెళ్లారు. విధుల్లో చేరిన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్లు రెడ్డిశేఖర్, జాకీర్ హుస్సేన్, ఆర్‌ఐ నాగేంద్ర వీఆర్వోలు శుభాకాంక్షలు తెలిపారు.

తనకల్లు: మండల తహసీల్దార్‌గా శోభ సువర్ణమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు హంద్రీ–నీవా విభాగంలో డీటీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. స్థానిక డిప్యూటీ తహసీల్దార్ మధునాయక్ నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరిటెండెంట్ నాగేశ్వర్‌రావు, వీఆర్వోలు మహేష్, గంగాధర్, మనోహర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి తహసీల్దార్‌గా రమాదేవి..

కనగానపల్లి: మండల నూతన తహసీల్దార్‌గా కె.రమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కర్నూలు జిల్లా నుంచి పదోన్నతిపై వచ్చారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పీ.వీ.రమణ బదిలీ అయ్యారు. డీటీ ప్రసాద్‌తో పాటు స్థానిక రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో 'కియా' ఉద్యోగికి గాయాలు

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో కియా ఉద్యోగి గాయపడిన సంఘటన తిమ్మాపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కియా పరిశ్రమలోని అసెంబ్లీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహేష్ బైక్‌పై గురువారం విధులుకు హాజరయ్యేందుకు బయలుదేరాడు. తిమ్మాపురం క్రాస్ సమీపంలోని దాబా వద్ద ఎదురుగానే ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని ఎదురుగా ఢీకొన్నాడు. ఘటనలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని అంబులెన్స్‌లో పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బొలెరో

- వ్యక్తి మృతి



దేవిరెడ్డి బాబూరెడ్డి (ఫైల్)

నల్లచెరువు: మండల పరిధిలోని చిన్న ఎల్లంపల్లి సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవిరెడ్డి పల్లికి చెందిన దేవిరెడ్డి బాబూరెడ్డి (30) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. దేవిరెడ్డి బాబూరెడ్డి కదిరి వైపు నుంచి తన ద్విచక్ర వాహనంలో దేవిరెడ్డి పల్లికి బయలు దేరాడు. అయితే చిన్న ఎల్లంపల్లి ఫ్లై ఓవర్ వద్దకు రాగానే నల్లచెరువు వైపు నుంచి ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బాబూరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, కుమార్తె ఉన్నారు. ఎస్‌ఐ వరలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ సరస్వతి

బత్తలపల్లి: బత్తలపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటిస్తూ మెరుగైన సేవలు అందించాలని సీడీపీఓ సరస్వతి ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు చెందిన కార్యకర్తలతో ప్రాజెక్టు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త క్రమం తప్పకుండా కేంద్రానికి రావాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు కేంద్రాల్లో ఉండాలన్నారు. చిన్నారులను ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాలన్నారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు సరైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అన్ని వయస్సుల పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. హైరిస్కు గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. కేంద్రాల్లో న్యూట్రిషియన్ చార్టులు, టైమ్ టేబుల్ డిస్‌ప్లే చేయాలన్నారు. కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి అందే పాలు, గుడ్లు, బాలామృతం, వైఎస్సార్ కిట్లు అందించాలని తెలిపారు. సమావేశంలో సూపర్‌వైజర్లు చంద్రమ్మ, దేవమణి, లలితమ్మ, సీనియర్ అసిస్టెంట్ శంకరమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం శ్రీ చౌడేశ్వరి దేవి సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 16 మంది రక్తదానం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మలత, వైద్యులు, ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ హరి, చౌడేశ్వరిదేవి సేవా సమితి సభ్యులు రక్తదానంపై రోగులు, ప్రజలకు అవగాహన కల్పించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు.

బత్తలపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సౌజన్య కుమారి

బత్తలపల్లి: ధర్మవరం ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న పి.సౌజన్య కుమారి గురువారం బత్తలపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ సాయిమనోహర్ శిక్షణ నిమిత్తం వెళ్లినట్లు తెలిపారు. అనంతరం కార్యాలయం సిబ్బందితో సమావేశమయ్యారు. అధికారులతో కలిసి మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ దివాకర్, మల్లికార్జున, చిన్నసూరి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, ఏపీఓ ఆదెప్ప, కార్యదర్శులు పాల్గొన్నారు.